విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఆంజనేయ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంజనేయనగర్, జనతానగర్, అర్జున్ బస్తీ, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మోతీనగర్‌లో...

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పద్మావతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జీకే పాయింట్ హోటల్, రాణాప్రతాఫ్ నగర్, ఆర్‌కె సొసైటీ, థామస్ స్కూలు వద్ద, శివబస్తీ ప్రాంతం, కెఎస్ నగర్, దర్గా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జులై 30, 2024 నుంచి జనవరి 21, 2025 వరకు వచ్చిన హుండీ కానుకలను లెక్కింపు చేపట్టినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి జి.ఎ.కే కృష్ణ పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం. విఠలయ్య పర్యవేక్షణలో లెక్కించగా మొత్తం 2లక్షల 91 వేల 340 రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేత



వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కంపెనీ నిర్వాహకులు

ఆల్విన్‌కాలనీ: ఎస్‌జీఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారు సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ప్లేట్లు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా వృద్ధులకు పలు రకాలైన వస్తువులు అందజేయటం ఎంతో సంతృప్తిని కలుగజేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధీర యోగి, సౌమ్య, రఘు, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని ట్రాప్ చేసి.. రూ. 50 వేల డిమాండ్



పోలీసుల సంరక్షణలో బాలకృష్ణ..

కేపీహెచ్‌బీకాలనీ: మహారాష్ట్రకు వెళ్లిన ఓ వ్యక్తిని ట్రాప్ చేసి కొందరు అతడి కుమారుడికి ఫోన్ చేసి రూ. 50వేలు డిమాండ్ చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..శంషీగూడకు చెందిన బాలకృష్ణ ఈ నెల 20వ తేదీన మహారాష్ట్రలో ఉండే తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్లాడు. అయితే బాలకృష్ణను ట్రాప్ చేసిన కొందరు మంగళవారం అతడి కుమారుడు లిఖిత్‌రెడ్డికి ఫోన్ చేసి మీ తండ్రిని ఫారెస్ట్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని, రూ.50 వేలు ఇస్తే వదిలిపెడతారని బెదిరించారు. దీంతో అనుమానం వచ్చిన లిఖిత్‌రెడ్డి వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బెదిరింపుదారుల నుంచి వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా లైవ్ లొకేషన్‌ను గురించి వెంటనే జల్గమ్ ప్రాంతంలోని ముత్తాయిన్‌నగర్ ప్రాంత పోలీసులకు సమాచారం అందించి లైవ్ లొకేషన్‌ను షేర్ చేశారు. దాని ఆధారంగా అక్కడి పోలీసులు బాలకృష్ణ వద్దకు చేరుకోగా అక్కడ ఎవరూ లేకపోవడంతో వారు ట్రాప్ చేసి బెదిరించారని తేలింది. దీంతో బాలకృష్ణను సురక్షితంగా హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. అయితే ఫిర్యాదుపై వెంటనే స్పందించిన కేపీహెచ్‌బీ పోలీసులపై ఉన్నతాధికారులతో పాటు ప్రజలు ప్రశంసిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని పోలీసులు సూచించారు.

మందుల దుకాణాల తనిఖీ

దుండిగల్: మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హేమలత మంగళవారం తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నారా.. అన్న అంశంపై ఆరా తీశారు. ఐదేళ్లకు ఒకసారి మెడికల్ షాపులను రెన్యూవల్ చేసుకుంటున్నారా? అన్న వివరాలను తెలుసుకున్నారు. అదే విధంగా స్థానికంగా క్లినిక్‌లు నిర్వహించే ఆర్‌ఎంపీ డాక్టర్లు రాసే మందులను సైతం పరిశీలించినట్లు తెలిసింది.



పార్కులో పగిలిన బండలు



కూకట్‌పల్లి రంగధాముని చెరువు వద్ద లేక్‌ఫ్రంట్ పార్కు ప్రవేశ ద్వారం

పట్టించుకునేవారు లేక..

మూసాపేట: పట్టించుకునేవారు లేక లేక్ ఫ్రంట్ పార్కు అస్తవ్యస్తంగా తయారైంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏర్పాటైన సంవత్సరంలోపే ఫ్యూజ్ బాక్సులకు మూతలు లేకపోవటం, లేక్ ఫ్రంట్ పార్కు గేటు విరిగిపోవటం, బండలు పగిలిపోవటం లాంటి సమస్యలు





పార్కులో మద్యం బాటిళ్లు, చెత్త

అధ్వానంగా లేక్ ఫ్రంట్ పార్కు

ఏర్పడ్డాయి. నిర్వహణ ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మరింత శిథిలం కానున్నది.

- పార్కులో ఉన్న 18 ఫ్యూజ్ బాక్స్‌లకు మూతల్లేవు. 5 సంవత్సరాలలోపు చిన్నారులకు సైతం తేలికగా అందే ఎత్తులో బాక్స్‌లు ఉన్నాయి. చిన్నారుల తల్లిదండ్రులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- బోర్ మోటార్ బాక్స్ కూడా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. బోర్ ఉన్న గుంత తెరిచి ఉంచటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- బండలు పగిలిపోయి నడవడానికి వీలు లేకుండా ఉన్నాయి. పక్కనే పెద్ద చెరువు, బోరు ఉన్నా పార్కులో చెట్లు మాత్రం ఎండిపోయాయి. ఇక పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన గడ్డి కూడా ఎండిపోయింది.
- సాయంత్రం వేళ ఈ పార్కుకు ప్రజల రాకపోకలు ఎక్కువ. ఇక రాత్రి సమయంలో మందుబాబులు తిష్ట వేసి మద్యం తాగి బాటిళ్లను అక్కడే పడేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్స్







పార్కులో బోరు ఉన్నా ఎండిపోతున్న మొక్కలు, గడ్డి

దోమల నివారణకు చర్యలు

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు, జయానగర్ కాలనీ వాసులు దోమల బెడద సమస్య ఎక్కువగా ఉందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మంగళవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి దోమల నివారణకు ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్‌ను చెరువులో వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ఆయిల్ బాల్స్‌ను చెరువులో వేయటం వల్ల లార్వ దశలోనే దోమలు మృతి చెందుతాయన్నారు. ఎల్లమ్మ చెరువులో గుర్రపు డెక్క మొత్తాన్ని తొలగించి చెరువుని శుభ్రం చేసే విషయమైన శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీతోపాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, రాజేష్, పోశెట్టి గౌడ్, శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎంటమాలజి సూపర్‌వైజర్ డి. నరసింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్‌ను చెరువులో వేస్తున్న సిబ్బంది

గుడ్‌బై ఆల్ అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టి విద్యార్థి అదృశ్యం



చింతల పవన్ మణికంఠ

కేపీహెచ్‌బీకాలనీ: గుడ్‌బై టు ఆల్ అని ఓ విద్యార్థి ఇన్‌స్టాగామ్‌లో మెజేస్ పెట్టి అదృశ్యమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... నర్సరావుపేటకు చెందిన చింతల వెంకటేశ్వర్లు కుమారుడు చింతల పవన్ మణికంఠ (19) కేపీహెచ్‌బీకాలనీలో వెంకటేశ్వర బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ స్థానిక కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు. సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లిన పవన్ మణికంఠ మంగళవారం ఉదయం 4.30 గంటలకు ఊరి నుంచి వచ్చి కేపీహెచ్‌బీ కాలనీ వద్ద దిగాడు. తాను కేపీహెచ్‌బీ చేరుకున్నాక టీతాగి కోచింగ్ సెంటర్‌కు వెళతానని ఫోన్‌చేసి తల్లిదండ్రులకు చెప్పాడు. కొద్దిసేపటి తరువాత సెల్‌ఫోన్ స్విచ్ఛాప్ రావటంతో అతని కజిన్ సోదరుడు చింతల రామయ్యకు ఫోన్ చేసి చెప్పగా అతను హాస్టల్ వద్ద విచారించగా ఇంకా హాస్టల్‌కు రాలేదని చెప్పారు. అయితే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటం, కోచింగ్ సెంటర్‌లో లేకపోవటంతో పాటు ఇన్‌స్టాగామ్‌లో 'గుడ్ బై టు ఆల్' 'మరో జన్మ అంటూ ఉంటే దే తల్లిదండ్రులు, స్నేహితులు కావాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను' అని పోస్ట్ చేశాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కుత్బుల్లాపూర్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ రవాణాశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటలతో వాహనదారులను చైతన్యపరిచారు. ప్రధాన జంక్షన్ వద్ద రోడ్లను జాగ్రత్తగా దాటాలని, వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారడంతో జారిపడే ఆస్కారముందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడరాదన్నారు.

సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి

బాలానగర్: సీపీఎం రాష్ట్ర మహాసభలు ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని వీటిని విజయవంతం చేయాలని సీపీఎం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ కోరారు. మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ శ్రీశ్రీ నగర్ సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమాల దిక్సూచి పోరాటాల సారధి కష్టజీవుల గొంతుగా సీపీఎం రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహా సభలు సంగారెడ్డి పట్టణంలో జరుగుతాయని, ఈ మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. శ్రీను, పి. ధర్మారావు, ఎలీషా, నరసింహ, రాములు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టరును ఆవిష్కరిస్తున్న రాజశేఖర్, శంకర్

జాతీయస్థాయి పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శారద భవాన్స్ కాలేజీ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. దీంతో ఈ నెల 27వ తేదీ నుంచి అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో శారద కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాల నుంచి పాల్గొననుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి. వెంకటయ్య, అధ్యాపకులు విద్యార్థినీని ఘనంగా సన్మానించారు. జాతీయస్థాయి పోటీల్లో ఎంపికైన శారద భారత క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలని ప్రిన్సిపాల్ వెంకటయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టపడేవారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందనే విషయాన్ని మరోసారి శారద తెలియజెప్పినదంటూ ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి

మోతీనగర్: మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యపు ధోరణి అవలంభిస్తుందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్లను, నగర మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకునే విధంగా చట్టాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం పర్వత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంతో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల చైర్మన్, వార్డు సభ్యుల పదవీకాలం పూర్తవుతున్న ప్రభుత్వం ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించకపోవడం విచిత్రంగా ఉందని విమర్శించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలలో సర్పంచుల పదవీ కాలం ముగిసి సుమారు సంవత్సరం కావస్తున్నా వారి ద్వారానే పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. గతంలో పలు పర్యాయాలు గ్రామ సర్పంచ్ మాదిరిగా పట్టణ ప్రజలు ప్రత్యక్షంగా చైర్మన్‌ను ఎన్నుకునేవారని, అదే విధంగా నగర మేయర్‌ని ప్రత్యక్షంగా నగర పరిధిలో ఎన్నుకునేవారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మల్లాది కిషోర్, కారుమంచి గణేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వంశీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మలపల్లి శ్రీనివాస్

సేవాగుణంలో మార్గదర్శకంగా నిలవాలి

ఎమ్మెల్యే మాధవరం

మూసాపేట: మనం ఏస్థాయిలో ఉన్న సేవాగుణంలో ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రజా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రజా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అనేక సంవత్సరాలుగా బస్తీ ప్రజలకు మేలు చేసే విధంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నదని, సంస్థ ప్రతినిధులు అందరూ చిరు ఉద్యోగులు అయినప్పటికీ వారిలోని సేవా గుణం ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు తుకారాం, నర్సింహ, వెంకట్‌స్వామి, జైరాజ్, అరుణ్, ప్రజా వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షులు వినోద్, కార్యదర్శి రమేష్, అర్జున్, సంజయ్, అంబ్రోస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణారావుతో ప్రజా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గ సభ్యులు

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే వ్యాధులు రావు

మోతీనగర్: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే వ్యాధులు రావని, అందుకే ప్రతి ఒక్కరూ చెత్తను స్వచ్ఛ ఆటో నిర్వాహకులనే అందజేయాలని శానిటరీ సూపర్‌వైజర్ జమీల్ హైమద్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మోతీనగర్ స్నేహపురి కాలనీలో మంగళవారం పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడి, పొడి చెత్త వేరు వేరుగా అందించాలని ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇంటితోపాటు పరిసరాల శుభ్రతగా కూడా ముఖ్యంగా భావించాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా స్వచ్ఛ ఆటో వారికే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్లు యాదగిరి, ముఖేష్, ఎస్ఎఫ్ఏ మహమ్మద్ రియాజ్, విష్ణుతో పాటు పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహించిన పారిశుధ్య కార్మికులు

ప్రపంచంలో నెగ్గుకురావాలంటే ఆవిష్కరణలు అవసరం

జెఎన్‌టీయుహెచ్ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: ఫార్మారంగం ఎదుర్కొంటున్న ఆధునిక సవాళ్లను దీటుగా ఎదుర్కొని పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే యువ నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జెఎన్‌టీయుహెచ్ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి అన్నారు. జేఎన్‌టీయుహెచ్‌లోని ఆడిటోరియంలో మంగళవారం సుల్తాన్‌పూర్ ఫార్మ కళాశాల, సెంట్ పీటర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'ఫార్మా ఆవిష్కరణలు–మార్పుల నిర్వహణలో యువ నాయకత్వం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వీసీ బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్రం సత్తాను చాటుతూ 130 బిలియన్ డాలర్ల వృద్ధిని సాధించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఫార్మా రంగంలో యువ పారిశ్రామికవేత్తలు తమదైన ముద్ర వేయాలన్నారు. బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఆవిష్కరణలతో దూసుకుపోవాలని సూచించారు. కళాశాలల్లో పాఠ్యాంశాలపై అవగాహన పెంపొందుతుందని, సదుస్సులు సమావేశాలతో మేధస్సును బలోపేతం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ దా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, జెఎస్‌ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, మైసూరు, ఫార్మాస్యూటికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు ప్రొ. బి. సురేష్, అల్బనీ కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ అండ్ హెల్త్ సైన్సెస్ డాక్టర్ టోయిన్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.వి. నారాయణ తదితరులతో పాటు దేశ, విదేశాలకు చెందిన ఫార్మా రంగ నిపుణులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వీసీ వీసీ బాలకిష్టారెడ్డి, తదితరులు

పరికి చెరువులో నిర్మాణాలు నిలిపి వేయాలి

జగద్గిరిగుట్ట: పరికి చెరువులో నిర్మాణాలు నిలిపి వేయాలని ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.. పరికి చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ హద్దులు, ప్రభుత్వ సర్వే నంబర్లను, గతంలో ఉన్న ఫొటోలు తదితర వివరాలను అందజేశామన్నారు. అదే విధంగా పరికి చెరువును, గుట్టపై ఉన్న భూములను హైడ్రా కమిషనర్ పరిశీలించిన క్రమంలో నూతనంగా బేస్మెంట్ నిర్మాణం జరిగిందని చెప్పామని, అక్రమమని తెలితే కూల్చివేస్తామని కమిషనర్ తెలిపారన్నారు. పర్యటన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. బుధవారం అందరితో సమావేశం నిర్వహించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ స్థలాలు, బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోడల్ అధికారి గణపతి పేర్కొన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాస్ కాలనీకి ఆనుకొని వున్న అంబీర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాన్ని జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. సంక్రాంతి పండుగ సెలవులను అదునుగా చూసుకొని చెరువు స్థలాన్ని సైతం వదలకుండా భారీ షెడ్‌ను నిర్మించారు. అయితే దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో సర్కిల్ సిబ్బంది ఆక్రమించిన షెడ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి గణపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు పరిరక్షించడానికి హైడ్రాను ఏర్పాటు చేయటం జరిగిందని గుర్తు చేశారు. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేలమట్టం అయిన అక్ర నిర్మాణం

బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి వచ్చేంత వరకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పాలనలో నియోజకవర్గంలో ప్రజలకు ఎన్నో ఉపయోగపడే పనులు చేశామని, ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే విధంగా కార్పొరేటర్లు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే అండగా నిలుస్తున్నారని, ఆ కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందుకు కార్యకర్తకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాడు కేసీఆర్ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, నేడు కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. తిరిగి మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని, అందుకు నాయకులు, కార్యకర్తలు కూడా తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, ముద్దం నరసింహ యాదవ్, సబిహా బేగం, పగుడాల శిరీష బాబూరావు, మందడి శ్రీనివాసరావు, మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్‌లు తూము శ్రావణ్‌కుమార్, పగడాల బాబురావు, మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, భిక్షపతి, శాకయ్య, సురేష్ యాదవ్, బొట్టు విష్ణు, మక్కల నరసింగరావు, సాయిబాబు చౌదరి, శ్యామల రాజు, ఎర్రబెల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశం

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాటర్ వర్క్స్ అధికారులతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా గతంలో ప్రారంభించిన పనులు త్వరగా పూర్తి చేయాలని, నూతన పనులకు సంబంధించి ఇటీవలే ఎంఇని కలిసి తెలియజేయటం జరిగిందన్నారు. దీనికి సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పైపులైన్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు త్వరగా పూర్తి చేయాలని, ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే అందుబాటులోకి తీసుకు వచ్చేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం ప్రభాకర్, మెగా ఇంజినీరింగ్ అజయ్, అధికారులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాధవరం కృష్ణారావు



వాటర్‌వర్క్స్ అధికారుల సమావేశంలో మాధవరం